# ప్రైవేట్ పాఠశాలల అధ్యయన నివేదిక
# తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు

## I. సందర్శించిన జిల్లాలు – పాఠశాలలు – పిల్లల, ఉపాధ్యాయుల వివరాలు

1. అధ్యయనం చేసిన జిల్లాలు: తెలంగాణ రాష్ట్రంలోని 10 జిల్లాలు.
2. అధ్యయనంలో పరిశీలించిన పాఠశాలల సంఖ్య: 442 (వీటిలో 367 ఇంగ్లీష్ మీడియ పాఠశాలలు, 73 తెలుగు మీడియం, 2 ఉర్దూ మీడియం పాఠశాలు ఉన్నాయి)
3. పరిశీలించిన పిల్లల సంఖ్య : 83515
4. అధ్యయనంలో భాగంగా సమాచారం సేకరించబడిన ఉపాధ్యాయుల సంఖ్య: 10291
5. అధ్యయనం చేసిన వారు: రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ, డైట్, రాష్ట్ర రిసోర్సు గ్రూప్ సభ్యులు, ఉపాధ్యాయులు

## II. అధ్యయనం జరిపిన తీరు

ప్రతి జిల్లాలో సగటున కనీసం 40 పాఠశాలల చొప్పున పరిశీలించారు. వీటిలో వివిధ మాధ్యమాలతోపాటు జిల్లా కేంద్రం, డివిజన్ కేంద్రాలు, మండల స్థాయిలోని పాఠశాలలను కూడా అధ్యయనం చేశారు. వీటిలో పట్టణ ప్రాంతం, గ్రామీణ ప్రాంతాలు కూడా ఉన్నాయి. అట్లే సాధారణ ప్రైవేట్ స్కూళ్ళతోపాటు కార్పొరేట్ పాఠశాలలను కూడా అధ్యనం చేశారు.

ప్రశ్నావళులు, ఇంటర్వ్యూలు, ప్రత్యక్ష పరిశీలన, రికార్డుల పరిశీలన, ఫోకస్ గ్రూప్ డిస్కషన్ వంటి సాధనాలు పద్ధతులను వినియోగించి అధ్యయనం చేశారు.

## III. పిల్లల ప్రగతి వివరాలు – తెలుగు, ఆంగ్లం, గణితం విషయాలలో కనీస సామర్థ్యాల స్థాయి పరిశీలన

- అధ్యయనంలో భాగంగా 10వ తరగతితోపాటు 6, 7, 8 తరగతులలోని పిల్లల స్థాయిని ఆంగ్లం, తెలుగులో చదవడం, అర్థం చేసుకోవడం, సొంతంగా రాయడం అనే సామర్థ్యాలలో పిల్లల స్థాయిని పరిశీలించారు. అట్లే గణితంలో తీసివేత, గుణకార, భాగహారాలలో పిల్లల స్థాయిని పరిశీలించారు. వాటి వివరాలు కింది విధంగా ఉన్నాయి.

| మొత్తం పిల్లల సంఖ్య | తెలుగు | | | ఇంగ్లీష్ | | | గణితం | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | చదవగలిగిన వారు | చదివింది అర్థం చేసుకోగలిగేవారు | సొంతంగా రాయగలిగిన వారు | Reading | Reading & compre-hension | Self writing | తీసివేతలు చేయగలిగిన వారు | గుణకారం చేయగలిగిన వారు | భాగహారం చేయగలిగిన వారు |
| 78,082 | 65.5% | 58.1% | 52.4% | 70.3% | 60.4% | 54.1% | 73.9% | 65.9% | 57.7% |

- భాషా పరంగా చదవడం, అర్థం చేసుకోవడం, సొంతంగా రాయడంలో తెలుగు కంటే ఆంగ్లంలో కొంత మెరుగ్గా ఉన్నారు. అయితే సొంతంగా రాయగలగడంలో తెలుగు, ఇంగ్లీష్‌లో పెద్దగా తేడా లేదు. ఏమైనప్పటికీ భాషాపరంగా చదవడం, రాయడం లేని పిల్లలు సుమారు సగం మంది ఉండడం ఆందోళన కలిగించే అంశం.
- గణితంలో తీసివేత, గుణకారం, భాగహారాలను 4వ తరగతి పూర్తయ్యేసరికే చేయగలగాలి. కాని ఉన్నత స్థాయిలో అనగా 6 నుండి 10వ తరగతి పిల్లలకు కూడా వీటిని పూర్తిగా చేయలేకపోతున్నారు. భాగహారం చేయలేని వారు 43% పిల్లలు ఉన్నారు. గుణకారం చేయలేని వారు 34% మంది ఉన్నారు.

## IV. ఉపాధ్యాయుల వివరాలు - స్థాయి

- ఈ అధ్యయనంలో భాగంగా 10,291 మంది ఉపాధ్యాయుల నుండి సమాచారం సేకరించడం జరిగింది. వీళ్ళలో 6,852 మంది డిగ్రీ లేదా పి.జి. స్థాయి వారు పని చేస్తున్నారు. అట్లే 7,263 మంది ఉపాధ్యాయులు ఉపాధ్యాయ శిక్షణ పొందినవారు ఉన్నారు. అయితే 3,384 మంది మాత్రమే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టి.ఇ.టి) ఉత్తీర్ణులైనవారు ఉన్నారు.
- కొన్ని పాఠశాలలు సైన్స్, గణితం బోధించడానికి ఇంజనీరింగ్ చదివినవారు కూడా ఉన్నారు. వీరికి బోధనపైన ఎలాంటి అవగాహన లేదు. పిల్లలతో ఎలా ప్రవర్తించాలో కూడా వారికి తెలియదు.
- **ఉపాధ్యాయుల విషయ పరిజ్ఞానం - స్థాయి:** సుమారు 70% మంది ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలను పూర్తిగా చదవలేదు. పాఠ్యపుస్తకాల నేపథ్యం, తాత్వికత, వీటిని ఉపయోగించే విధానంపై అవగాహన కలిగినవారు అతి తక్కువ అనగా.. 15% మంది మాత్రమే ఉన్నారు.
- అట్లే బోధిస్తున్న సబ్జక్టుకు సంబంధించిన విషయ పరిజ్ఞానంలో చాలా మంది సమాధానాలు రాయలేకపోయారు. అనగా.. ఇచ్చిన ప్రశ్నలను చదివి, తిరిగి ఖాళీగా ఇచ్చివేశారు. కేవలం 30% మంది మాత్రమే కొంతమేరకు పాఠ్యపుస్తకాల ఆధారంగా రాయగలిగారు.
- ఈ మధ్యకాలంలో చోటు చేసుకున్న పరీక్షల సంస్కరణలు లేదా నిరంతర సమగ్ర మూల్యాంకనం (సి.సి.ఇ.) విధానాల గురించి అవగాహన ఉన్నవారు లేరనే చెప్పవచ్చు.
- **బోధనాభ్యసన ప్రక్రియలు - పాఠ్యపుస్తకాల వినియోగం - పిల్లలకు కల్పించే అభ్యాసం:** అధ్యయనంలో భాగంగా ప్రైవేట్ పాఠశాలలో ఏ పాఠ్యపుస్తకాలను వినియోగిస్తున్నారని పరిశీలించారు. ప్రాథమిక స్థాయిలో అనగా.. 1 నుండి 5 వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో ప్రభుత్వం నాణ్యమైన పుస్తకాలు రూపొందించినప్పటికి కూడా వీటిని కేవలం 24.6% పాఠశాలల్లో మాత్రమే ఉపయోగిస్తున్నారు. మిగతా పాఠశాలల్లో ప్రైవేట్ పబ్లిషర్స్ ప్రచురించిన పుస్తకాలను వాడుతున్నారు.
- పాఠ్యపుస్తకాలతోపాటు వర్క్‌బుక్‌లను కూడా ఉపయోగిస్తున్నారు. సుమారు 10 నుండి 15 నోటు పుస్తకాలను వాడుతున్నారు.
- ఈ పాఠ్యపుస్తకాలను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠశాలలో లేదా పాఠశాలకు సంబంధించిన దుకాణాల్లో యాజమాన్యం నిర్దేశించిన విధంగా కొనుగోలు చేస్తున్నారు.
- ఈ పాఠ్యపుస్తకాలు రాష్ట్ర విద్యా ప్రణాళికకు అనుగుణంగా గాని లేదా ఆర్.టి.ఇ. చట్టంలోని అధ్యాయం-5 సెక్షన్ (బి) సూచించిన సూచనల ప్రకారం లేవు. ఈ పుస్తకాలను ఆయా యాజమాన్యాలే ఎంపిక చేసుకుంటాయి.

- అయితే ఒక పాఠశాలలో వాడే పుస్తకాలు వారు సూచించిన షాపులో తప్ప ఎక్కడా దొరకవు.
- ఈ పాఠ్యపుస్తకాలు కృత్యాధారంగా, రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించిన సామర్థ్యాల కనుగుణంగా రూపొందించబడి ఉండవు.
- ఉన్నత తరగతులకు అనగా 6 నుండి 10 తరగతులకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను వినియోగిస్తున్నారు. వాటిలో అందరి పిల్లల వద్ద గైడ్లు, స్టడీ మెటీరియళ్ళు ఉన్నాయి.

## V పాఠ్యప్రణాళిక – సబ్జెక్టులు

రాష్ట్ర ప్రభుత్వం 1 నుండి 10 తరగతుల వరకు ఏ సబ్జెక్టులు ఉండాలో నిర్ధారించింది. పిల్లల మానసిక స్థాయి, బోధనాశాస్త్రం, ఆర్.టి.ఇ. చట్టం మొదలగు వాటిని పరిగణలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం అకడమిక్ అథారిటీగాగుర్తించబడిన ఎస్.సి.ఇ.ఆర్.టి గుర్తిస్తుంది. పాఠ్య విషయాలతో పాటు ఆర్.టి.ఇ చట్టం ప్రకారం సహ పాఠ్యాంశాలు కూడా బోధించాల్సి ఉంటుంది. కాని ప్రైవేటు పాఠశాలల్లో బోధించే సబ్జెక్టులను పరిశీలిస్తే వాటిని పూర్తిగా విస్మరించినట్లుగా అధ్యయనంలో తేలింది. వాటి వివరాలు కింద పరిశీలించండి.

| తరగతులు | బోధించాల్సిన సబ్జెక్టులు | ప్రైవేటు పాఠశాలల్లో బోధిస్తున్న సబ్జెక్టులు |
|---|---|---|
| 1,2 | ప్రథమ భాష (మాతృభాష), ద్వితీయ భాష (ఆంగ్లం), గణితం, సహపాఠ్య సబ్జెక్టులు | తెలుగు, ఇంగ్లీష్, హిందీ, గణితం కంప్యూటర్, జి.కె, సైన్స్, సోషల్ మొ॥వి |
| 3,4,5 | ప్రథమ భాష (మాతృభాష), ద్వితీయ భాష (ఆంగ్లం), పరిసరాల విజ్ఞానం, గణితం, సహపాఠ్య సబ్జెక్టులు | తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సోషల్, గణితం, సామాన్య, అబాకస్, ఇంగ్లీష్ స్పోకెన్ లాంగ్వేజ్, ఇంగ్లీష్ గ్రామర్, జి.కె, కంప్యూటర్, మొ॥వి |

- అయితే ఉన్నత తరగతులు అనగా 6 నుండి 10 తరగతులకు సహపాఠ్య విషయాలను పూర్తిగా విస్మరించి తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సామాన్య, సాంఘిక, గణిత విషయాలను మాత్రమే బోధిస్తారు.

## VI పాఠశాలల పనివేళలు – సబ్జెక్టువారీ భారత్వం

- ఆర్.టి.ఇ. చట్టం ప్రకారం ఒక పాఠశాల వారానికి 45 గంటలు పని చేయాలి. వీటిలో ప్రాథమిక తరగతులకు 800 గంటలు, మిగతా తరగతులకు 1000 గంటలు బోధనాభ్యాసన ప్రక్రియలు నిర్వహించాలి. గౌరవ రాష్ట్ర హైకోర్టు దీనిని అమలు పరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పనివేళలను సవరిస్తూ ఆగస్టు 2014 మాసంలో ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఉత్తర్వు సంఖ్య 3, తేది.28.08.2014 ప్రకారం ప్రాథమిక పాఠశాలలు ప్రతిరోజు భోజన విరామంతో కలుపుకొని 7 గంటలు, ఉన్నత పాఠశాలలో భోజన విరామంతో కలుపుకొని 7.30 గంటలు పనిచేయాలి. ప్రాథమిక పాఠశాలల్లో రోజుకు 8 పీరియడ్లు (వారానికి 48 పీరియడ్లు), ఉన్నత పాఠశాలల్లో రోజుకు 9 పీరియడ్లు (వారానికి 54 పీరియడ్లు) చొప్పున నిర్వహించాలి.
- ఒక్కొక్క సబ్జెక్టుకు పీరియడ్లను కూడా నిర్ధారించారు. అయితే ప్రైవేటు పాఠశాలలు వీటిని పూర్తిగా పక్కకు పెట్టి తమకు ఇష్టమైన రీతిలో పాఠశాలలను నడుపుతున్నాయి.

- కేవలం 48% పాఠశాలలు మాత్రమే ప్రభుత్వం నిర్ధేశించిన పనివేళలు పాటిస్తున్నట్లు తెలిపినప్పటికి ఇది కూడా పూర్తి వాస్తవం కాదు.
- చాలా పాఠశాలలు ఉదయం 8.30 నుండి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తున్నారు. మరికొన్ని పాఠశాలలు 9.00 నుండి 5.30 వరకు పని చేస్తున్నాయి. కార్పొరేట్ పాఠశాలలు 8.30 నుండి 6.30 వరకు నడుస్తున్నాయి.
- కొన్ని పాఠశాలల్లో రోజుకు 11 పీరియడ్లను నిర్వహిస్తున్నారు. కనీసం స్వల్ప విరామ సమయం కూడా పిల్లలకు ఉండదు.
- పిల్లలుగాని, తల్లిదండ్రులుగాని పాఠశాలల పనివేళల గురించి అడిగినా పట్టించుకోరు, స్పందించరు. తమకు ప్రత్యేక అనుమతులున్నాయని బుకాయిస్తారు. (తల్లిదండ్రుల సమావేశంలో తెలిసిన విషయం).
- 10వ తరగతి పిల్లలను పరీక్షకు సిద్ధం చేసే నెపంతో కొన్ని పాఠశాలల్లో రాత్రి 8.00 గంటల వరకు కూడా పిల్లలను బళ్లలోనే ఉంచుతున్నారు.
- అట్లే ప్రభుత్వం పాఠశాలల పనివేళల గురించి ఉత్తర్వులు ఇచ్చింది కాబట్టి 4.30 గంటలకు పిల్లల్ని వదిలిపెట్టినట్లే పాఠశాల సమీపంలోని కేంద్రాలలో లేదా భవనాలలో లేదా పాఠశాలలోనే కోచింగ్, ట్యూషన్ల పేర్లతో కూడా పిల్లల్ని ఉంచి తరగతులను నిర్వహిస్తున్నారు. ఇందుకు అదనంగా కూడా పిల్లల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు. దాదాపు ఏ పాఠశాలలో కూడా పిల్లల సమగ్ర అభివృద్ధిని ప్రభావితం చేసే ఆటలు ఆరోగ్య–వ్యాయామ విద్య, విలువలు–జీవన నైపుణ్యాలు, పని విద్య, కళలు–సాంస్కృతిక విద్య వంటివి నిర్వహించడం లేదు.
- ఇలాంటి సహపాఠ్యాంశ కార్యక్రమాలకు పీరియడ్లు కేటాయించి నిర్వహించాల్సి ఉన్నప్పటికి కూడా నిర్వహించడు లేదు. అయితే కొన్ని పాఠశాలల్లో మాత్రమే కొన్ని ప్రత్యేక సందర్భాల కోసం అనగా.. రిపబ్లిక్ డే, బాలల దినోత్సవం, వార్షికోత్సవాల సందర్భంగా అభ్యాసం చేయించి ప్రదర్శింపజేస్తున్నారు. కాని వీటిని ఒక రెగ్యులర్ సబ్జెక్టుగా పరిగణించి రోజువారీ బోధనాభ్యసన ప్రక్రియల పరంగా ప్రభుత్వం నిర్ధేశించిన విధంగా నిర్వహించడం లేదు.

## VII ఉపాధ్యాయుల తయారీ – సంసిద్ధత

- దాదాపు 80% మంది ఉపాధ్యాయులు ఎలాంటి సంసిద్ధత లేకుండా అనగా వార్షిక ప్రణాళిక, పాఠ్యప్రణాళిక లేకుండానే పాఠ్యబోధన చేస్తున్నారు. మిగిలిన వారు మాత్రం డైరీలో బోధించిన విషయాన్ని నామమాత్రంగా రాస్తున్నారు.
- బోధనా సమయంలో సామాగ్రిని, పరికరాలను ఉపయోగించి బోధించిన సందర్భాలు లేవనే చెప్పవచ్చు. కేవలం పాఠ్యపుస్తకానికే పరిమితమై, దాంట్లోని విషయాలను వివరించడానికి పరిమితమైనారు.

## VIII బోధనా వనరులు – వాటి వినియోగం

- ఆర్.టి.ఇ. 2009 చట్టం ప్రకారం ప్రతి పాఠశాలలో తప్పని సరిగా గ్రంథాలయం, ప్రయోగశాల, బోధనకు అవసరమైన ఉపకరణాలు వంటి సామగ్రి ఉండాలి. అయితే కేవలం 22.4% పాఠశాలల్లో మాత్రం గ్రంథాలయ సౌకర్యం ఉంది. అట్లే 24% పాఠశాలల్లో మాత్రమే ప్రయోగశాలలు ఉన్నాయి. కాని వీటిని వినియోగించే సందర్భాలు దాదాపు లేవు. వీటిని వచ్చిన సందర్శకులకు, అధికారులకు చూపడానికి మాత్రమే పరిమితమైంది.

## IX బోధన తీరు తెన్నులు

రాష్ట్రంలో గత మూడు సంవత్సరాలుగా నూతన పాఠ్యపుస్తకాలు అమలులోకి వచ్చాయి. అట్లే ఆర్.టి.ఇ. చట్టం కూడా అమలులో ఉంది. నిరంతర సమగ్ర మూల్యాంకనం కూడా అమలు పరుస్తున్నారు. వీటి ప్రకారం చదువు చెప్పడం అంటే పిల్లలు ఒక విషయం గురించి అర్థం చేసుకోవడం, దాని గురించి ఆలోచించడం, వాటిని వ్యక్తపరచడం, విమర్శనాత్మకంగా విశ్లేషించడం, సమకాలీన, సామాజిక అంశాలతో అన్వయం చేసుకోడం, సూత్రీకరణలు, నిర్ధారణలు చేయగలగడం జరిగేలా ఉపాధ్యాయుల పనితీరు ఉండాలి. ఇందుకోసం ఉపాధ్యాయుడు పిల్లల్ని ఆలోచింపజేయాలి. అవసరమైన కృత్యాలు, ప్రయోగాలు,

చర్చలు, ప్రదర్శనలు వంటివి తమ బోధనలో వినియోగించాలి. పిల్లలకు సమాచారాన్ని అందించడానికి బదులు పిల్లలే సమాచారాన్ని గ్రహించి అర్థం చేసుకునేలా ఉపాధ్యాయుడు సౌకర్యకర్తగా వ్యవహరించాలి.

- దురదృష్టవశాత్తు ప్రైవేటు పాఠశాలల్లోని బోధన వీటికి ఆమడ దూరంలో ఉంది. చాలా పాఠశాలల్లో కేవలం పాఠ్య పుస్తకంలోని విషయాన్ని వివరించడానికి పరిమితమైతున్నారు. ఇది కూడా సమగ్రంగా, అర్థవంతంగా ఉండడం లేదు. నామమాత్రంగా వివరించి పిల్లలను పరీక్షలకు సిద్ధం చేయడం కోసం బట్టీ పట్టించడం, మళ్లీ మళ్లీ చదివించడం చేస్తున్నారు. పిల్లలకు అర్థమయ్యింది, కాలేదనే విషయాన్ని పట్టించుకోడం లేదు.
- అట్లే ప్రభుత్వం నిర్ధేశించిన విధంగా పాఠాలను ఆయా మాసాలలో పూర్తి చేయడానికి బదులు డిసెంబర్ మాసానికే అన్ని పాఠాలు పూర్తయ్యేలా తొందర తొందరగా సిలబస్ పూర్తి చేస్తున్నారు. వీళ్ళ దృష్టిలో చదువుచెప్పడం అంటే పాఠాన్ని ఒకసారి వివరించడం, పరీక్షలకు సిద్ధం చేసి మార్కులు సంపాదించడం మాత్రమే.
- కొన్ని పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు, ICT వసతులు ఉపయోగిస్తున్నారు. అయితే వీటిని కూడా ఒక పద్ధతి ప్రకారం బోధించే అంశంతో మిళితం చేయకుండా సందర్శకులను ఆకర్షించే నిమిత్తం కోసం నిర్వహిస్తున్నట్లుగా అనిపించింది.
- భౌతిక, రసాయన, జీవశాస్త్రాలలోని పాఠాలలో ప్రయోగాలున్నాయి. వీటిని నిర్వహించడం తప్పనిసరి. కాని వీటిని నిర్వహించకుండానే గైళ్ళలో చూసి చదువుకోమని చెబుతున్నారు.
- సామాన్య, సాంఘిక, తెలుగు, హిందీ పాఠ్య పుస్తకాల్లో పాఠం మధ్య మధ్యలో కూడా ప్రశ్నలు ఉన్నాయి. వీటిని బాక్సుల్లో ఇచ్చారు. వీటిని పాఠం బోధించే సమయంలో అడగాలి. చర్చ నిర్వహించాలి. దాదాపు ఏ పాఠశాల్లో కూడా వీటిని అడగకుండానే దాట వేస్తున్నారు.
- అట్లే గణితంలో ప్రతి అధ్యాయ ప్రారంభంలో ఉపోద్ఘాతం (Introduction) ఉన్నది. తరవాత 'ఇవి చేయండి' (Do This), 'ప్రయత్నించండి' (Try This), 'ఆలోచించండి–చర్చించండి' (Think-Discuss) అనే క్రమంలో గణిత భావనలను ప్రవేశపెట్టారు. వీటిని నిర్వహించిన అనంతరం ఆయా అధ్యాయంలోని అభ్యాసాలను నిరంతరంగా చేసేలా చూడాలి. కాని చాలా పాఠశాలల్లో ఈ విధంగా నిర్వహించడం లేదు. నేరుగా అభ్యాసాలలోని లెక్కను ప్రారంభించి లెక్కలు చెప్పడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.
- బోధన యాంత్రికంగా తూ తూ మంత్రంగా మారింది.

**కార్పొరేట్ పాఠశాలలు**

- వీటిలో తెలుగు, హిందీ సబ్జక్టులకు నామమాత్రపు ప్రాధాన్యత ఇస్తున్నారు. వీటికి కేటాయించిన పీరియడ్లను కూడా సైన్సు, గణితం బోధించడానికే ఉపయోగిస్తున్నారు.
- IIT ఫౌండేషన్ల పేరుతో పిల్లల స్థాయికి మించిన అంశాలను అర్థమైనా, కాకున్నా పిల్లలకు బోధిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ సిలబస్ పేరుతో ప్రత్యేకమైన సామాగ్రిని రూపొందించి ఉపయోగిస్తున్నారు. వీటిలో ఇంటర్, డిగ్రీ స్థాయికి చెందిన అంశాలు కూడా ఉన్నాయి.
- ఈ పాఠ్యప్రణాళిక ఇటు రాష్ట్ర ప్రభుత్వం నిర్ధేశించిన విధంగా గాని లేదా కేంద్ర ప్రభుత్వం నిర్ధేశించిన CBSE సిలబస్‌కు అనుగుణంగా గాని ఉండడం లేదు. ఇష్టారాజ్యాంగా సొంతంగా రూపొందించుకుంటున్నారు. తల్లిదండ్రుల బలహీనతలను సొమ్ము చేసుకుంటున్నారు.

**X పాఠ్యపుస్తకాల వినియోగం**

- ప్రస్తుతం అమలులో ఉన్న నూతన పాఠ్యపుస్తకాలను వినియోగించడానికి 'ఉపాధ్యాయులకు సూచనలు' పాఠ్య పుస్తకంలోనే ఇచ్చారు. కాని వీటిని ఏ పాఠశాలలో కూడా అమలుపరచడం లేదు.
- పాఠ్యపుస్తకంలోని అభ్యాసంలోని ప్రశ్నలకు పిల్లలు ఆలోచించి సొంతంగా జవాబులు రాయాలి. కాని దాదాపు అన్ని పాఠశాలల్లో గైడ్లు, స్టడీ మెటీరియళ్ళు చూసి రాస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు సంఖ్య 17తేదీ 14.05.2014

ప్రకారం గైడ్లు, స్టడీ మెటీరియళ్ళు వాడడం నిషేధం. అయినప్పటికి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం వీటిని ప్రోత్సహిస్తున్నాయి.

- అట్లే పాఠ్యపుస్తకాలోని ప్రాజెక్టు పనులను ఉపాధ్యాయులు పిల్లలకు అవగాహన కలిగించాలి. అందుకు అవసరమైన వనరులు సమకూర్చాలి. కాని వాటిని పట్టించుకోకుండా ఏకపక్షంగా చేసుకొనిరమ్మని చెబుతున్నారు. దీంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. పిల్లలు ఇంటర్నెట్‌ను ఆశ్రయిస్తున్నారు.
- కొన్ని పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు పిల్లల వద్ద ఉన్నప్పటి కూడా వాటిని వినియోగించకుండా స్టడీ మెటీరియళు ్ళ, గైడ్లు పిల్లలు వినియోగిస్తున్నారు. సందర్శన సమయంలో కూడా వీటిని ఉపయోగిస్తూ కనిపించారు.
- బోధనాభ్యసన ప్రక్రియలను అర్థవంతంగా మార్చడానికి ఆయా సబ్జక్టుల స్వభావాన్ని, అవసరాన్ని బట్టి అదనపు పీరియడ్లు కూడా కేటాయించారు. అనగా భాష సబ్జక్టుల కోసం గ్రంథాలయ పుస్తకాలు చదివి నివేదికలు రాయించడం కోసం వారానికి రెండు పీరియడ్లు, సాంఘిక శాస్త్రంలో సమకాలీన అంశాలు చర్చించడానికి వారానికి ఒక పీరియడ్, సైన్సులో ప్రమోగాలపై చర్చించి నివేదిక రాయడానికి వారానికి ఒక పీరియడ్ ఉన్నప్పటికి కూడా వీటిని నిర్వహించడం లేదు.

## XI పాఠశాల వాతావరణం – వసతులు

- సుమారు 85% పాఠశాలల్లో మూత్రశాలలు ఉన్నాయి. అయితే ఇవి పిల్లల సంఖ్యకు సరిపడా లేవు. అనగా సగటున 10 తరగుతులు ఉంటే 2 లేదా 3 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. వీటి నిర్వహణ కూడా సరిగ్గాలేద. తరగతి గదుల్లోకి దుర్గంధం వస్తున్నది. ఎవరైనా సందర్శకులు/ అధికారులు వస్తున్నపుడు మాత్రమే వీటిని శుభ్రం చేస్తున్నారని పిల్లలు తెలిపారు. ఆడపిల్లలు ఈ విషయంలో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంత మంది ఆడపిల్లలు మూత్రశాలలకు వెళ్ళమని తెలిపారు. వెళితే ఇన్‌ఫెక్షన్లు వస్తున్నాయని తెలిపారు.
- సుమారు 97% పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం ఉన్నట్లుగా తెలిపారు. అయితే ఇవి సురక్షితం కావనే భావనతో పిల్లలు, ఉపాధ్యాయులు తాగడానికి నీళ్ళ బాటిళ్ళను తమ వెంటనే తెచ్చుకుంటున్నారు.
- దాదాపు అన్ని పాఠశాలల్లో తరగతి గదుల్లో ఎలాంటి ఆకర్షణీయమైన వాతావరణం అగుపించలేదు. అనగా పిల్లల్ని ఆకర్షించే బొమ్మలు, సూక్తులు, చిత్రాలు మొదలైనవి లేవు. తరగతి గదిలో ఉపాధ్యాయులు కూర్చోవడానికి కుర్చీ లేదు. సగటున ఒక్కొక్క ఉపాధ్యాయుని/ ఉపాధ్యాయుడు 6 నుండి 8 పీరియడ్లు బోధిస్తున్నారు. ఈ మొత్తం సమయంలో కూడా వారు మొత్తం నిల్చొనే ఉండాలి.
- కొన్ని పాఠశాలల్లో మాత్రమే ఉపాధ్యాయులకు Staff Room వంటివి ఉన్నాయి. మిగతా పాఠశాలల్లో ఇవి లేకపోవడం వల్ల భోజన విరామ సమయంలో లేదా విరామ సమయంలో ఒరండాలో గాని తరగతుల్లో ఉన్న బెంచీలపై గాని కూర్చుంటున్నారు.
- కార్పొరేట్ పాఠశాలలు, మరికొన్ని పెద్ద పాఠశాలలు 4 నుండి 5 అంతస్థుల వరకు ఉంటున్నాయి. పిల్లలు అధిక బరువుతో కూడిన బ్యాగులను మోస్తూ మెట్లు ఎక్కి వెళ్ళాల్సిందే. పాఠశాల వదిలే సమయంలో తీవ్ర గందరగోళంగా కనిపిస్తుంది. అపార్టుమెంట్ల మాదిరిగా తరగతి గదులు ఉంటాయి.
- అతి తక్కువ పాఠశాలల్లో మాత్రమే తరగతి గదుల్లో ఫ్యాన్లు ఉన్నాయి. అపార్టుమెంట్ల మాదిరిగా ఇరుకిరుకు గదులు ఉండడం వల్ల గాలి, వెలుతురు ధారాళంగా రావడం లేదు. ఉక్కపోతతో పిల్లలు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.
- కొన్ని పాఠశాలలు షెడ్లు, రేకులతో కూడిన తరగతుల గదులు ఉండడం వల్ల పిల్లలు తీవ్ర ఉక్కపోతకు గురౌతున్నారు.
- దాదాపు 90% పాఠశాలలకు ఆట స్థలాలు లేవు. రాష్ట్ర రాజధానితో పోలిస్తే జిల్లా కేంద్రాల్లోని పాఠశాలలు కొంత మెరుగు. మండల స్థాయి పాఠశాలలు మరికొంత మెరుగు. అక్కడ మాత్రం ఆడుకోవడానికి కొంత స్థలం ఉంది.

- పాఠశాలల్లోని కరస్పాండెంట్ లేదా ప్రిన్సిపల్ గది మాత్రం ఆకర్షణీయంగా ఉంటుంది. తరగతి గదులకు, వీటికి మాత్రం పొంతన ఉండదు. తల్లిదండ్రులు (సందర్శకులు) అధికారులు, ఇలాంటి వారు ఎవరైనా కరెస్పాండెంట్ రూము వరకు మాత్రమే పరిమితమవుతారు. చాలా పాఠశాలల్లో వీరిని తరగతి గదుల వరకు వెళ్ళడానికి అనుమతించరు.
- ఉపాధ్యాయులకు ఉన్న స్వేచ్ఛ అంతంత మాత్రమే. యాజమాన్యం వారు నిర్దేశించిన విధంగానే బోధించడం, పని చేయడం జరుగుతుంది. బోధించే విధానాన్ని కూడా యాజమాన్యమే నిర్ణయిస్తుంది. ఉపాధ్యాయులు తమకు నచ్చిన విధంగా, పద్ధతి ప్రకారం బోధించడానికి అనుమతించరు. కార్పొరేట్ పాఠశాలల్లో అయితే ఏ రోజు ఏ విషయాన్ని బోధించి వాటికి సంబంధించి, ప్రశ్నలను, జవాబులను పిల్లల చేత జ్ఞాపకం చేయించాలో షెడ్యూలు ఇచ్చి దాని ప్రకారం ఉపాధ్యాయులతో పని చేస్తున్నారు.
- సామాగ్రి, పరికరాలు, ప్రయోగాలు వంటివి అవసరమున్నాయని తెలిపినా యాజమాన్యాలు వీటికి అనుమతించవు. యాజమాన్యం దృష్టి వీలైనంత త్వరగా సిలబస్ పూర్తి చేయడంపై ఉంటుంది. ఇందుకోసం వీరు ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తారు.
- దాదాపు ఎక్కువ పాఠశాలల్లో పిల్లల్ని దండిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల వద్ద కర్రలు ఉన్నాయి. పిల్లలు ప్రశ్నించడం గాని, స్వేచ్ఛగా మాట్లాడడం లేదు. ఉపాధ్యాయులు లేనపుడు మాత్రమే మనస్సులోని భావాలను చెబుతున్నారు.
- పిల్లలకు, ఉపాధ్యాయులకు మధ్య కూడా మానసికమైన అనుబంధం తక్కువగా ఉంటుంది. క్రమశిక్షణ పేరుతో చాలా సమయం నిశ్శబ్దంగానే ఉంటారు.
- బోధనా సమయంలో కూడా ఒక పీరియడ్‌లో బోధిస్తున్న పీరియడైతే ఉపాధ్యాయుడు పీరియడ్ మొత్తం మాట్లాడుతూ కనిపిస్తాడు. ఒకవేళ బోధనకు సంబంధించనిదైతే పిల్లలు నిశ్శబ్దంగా చదువుకుంటూనో, రాసుకుంటూనో కనిపిస్తారు.

## XII పరీక్షల సంస్కరణలు – CCE అమలు

- 2010 ఏప్రిల్ మాసం నుండి ఆర్.టి.ఇ. చట్టం అమల్లోకి వచ్చినందున 2011–12 విద్యా సంవత్సరం నుండి నిరంతర సమగ్ర మూల్యాంకనం 8వ తరగతి వరకు అమలు జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం 9,10 తరగతులకు సి.సి.ఇ. ని దృష్టిలో పెట్టుకొని 9,10 తరగతులకు పరీక్షల సంస్కరణలు ఈ సంవత్సరం నుండి అమల్లో తీసుకొని వచ్చింది. ఇందుకోసం 8వ తరగతి వరకు సి.సి.ఇ. ని అమలు చేయడానికి జి.ఓ. 60 తేది.24.10.2013ను గత విద్యా సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. 9,10 తరగతుల పరీక్షల సంస్కరణల కోసం జి.ఓ. 17, తేది.14.05.2014, జి.ఓ. 2, తేది.26.08.2014లు ఈ విద్యా సంవత్సరం విడుదల చేసింది, కాని ఏ పాఠశాలలో కూడా పరీక్షల సంస్కరణలు అమలు జరగడంలేదు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మూల్యాంకన విధానాలను అమలుపరచడం లేదు.
- 8వ తరగతి వరకు సి.సి.ఇ. ని పూర్తిగా ఏ పాఠశాలలో కూడా అమలుపరచడం లేదు. ఇప్పటికి కూడా ఇంకా యూనిట్ టెస్ట్‌లనే నిర్వహిస్తున్నారు.
- పుస్తక సమీక్ష (భాషా విషయాలలో) నూతన సమస్యలు రూపొందించడం (గణితం), ప్రయోగ రికార్డులు రాయడం (సామాన్య శాస్త్రం), సమకాలీన అంశాలపై ప్రతిస్పందనలు రాయడం (సాంఘిక శాస్త్రం), రాతపనులు, ప్రాజెక్టు పనులు, లఘు పరీక్ష (స్లిప్ టెస్ట్) ఏవి కూడా అమలు జరగడం లేదు.
- 6, 7, 8 తరగతులకు పాఠశాల స్థాయిలోనే సొంతంగా ప్రశ్నలు, సొంతంగా ప్రశ్నాపత్రాలు రూపొందించుకొని సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. అయితే వాటిలోని ప్రశ్నలు సామర్థ్యంగా ఆధారంగా లేవు.
- పిల్లల ప్రగతి పత్రాలపైన మాత్రం సి.సి.ఇ. ప్రకారం నిర్వహిస్తున్నట్లుగా ముద్రించబడి ఉంటుంది.

- 9, 10 తరగతుల్లో పరీక్షల సంస్కరణలు అమలు జరుగుతున్నందున వీటిని నిర్వహించాలని అందరికి తెలుసు. అంతర్గత మూల్యాంకనానికి 20 మార్కులు, సంగ్రహణాత్మక మూల్యాంకనానికి 80 మార్కులు అని అందిరికి తెలుసు.
- అయితే ఒక్కొక్క సబ్జక్టుకు చెందిన నిర్మాణాత్మక మూల్యాంకనంలోని నాలుగు అంశాలను నిర్వహించే అవగాహన 80% ఉపాధ్యాయులకు లేదు.
- రాతపనులలో భాగంగా పిల్లలు పాఠ్య పుస్తకంలోని ప్రశ్నలకు పిల్లలు సొంతంగా నోటుపుస్తకంలో జవాబులు రాయవలసి ఉంటుంది. గైడ్లు, మెటీరియలు చూసి రాయకూడదు. అయినా అందరు పిల్లలు వాటిలో చూసి ప్రశ్నలకు జవాబులు రాసిన అందరికి మార్కులు కేటాయించారు.
- ప్రాజెక్టు పనులు దాదాపు 70% పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. అయితే వాటిలో దాదాపు 90% పాఠశాలలో ఇవి చూసి రాయడం, సేకరించిన వాటిని అతికించడానికి పరిమితమైనారు. వీటికి పద్ధతి ప్రకారం రికార్డులు రాసి లేకున్నా కాని మార్కులు కేటాయిస్తున్నారు.
- కొన్ని పాఠశాలల్లో పిల్లల తల్లిదండ్రులను సంతృప్తి పరచడానికి పిల్లలకు స్థాయి లేకున్నా ఎక్కువ మార్కులు వేసి పంపిస్తున్నారు. అట్లే పరీక్షకు ముందే ప్రశ్నలను తెలిపి, బట్టీ పట్టించి, పరీక్షలు నిర్వహిస్తున్నారు.
- ఇప్పటి వరకు రెండు నిర్మాణాత్మక మూల్యాంకనాలు నిర్వహించి సంబంధిత ఆధారాలు భద్రపరిచి మార్కులు నమోదు చేయాల్సి ఉండగా దాదాపు ఏ పాఠశాలలో సక్రమంగా నిర్వహించిన దాఖలాలు లేవు.
- కార్పొరేట్ పాఠశాలలో సి.సి.ఇ. ని పరీక్షలను గాని సక్రమంగా నిర్వహించడం లేదు. ఎఫ్.ఎ.-1, ఎఫ్.ఎ.-2లన యూనిట్ టెస్ట్‌లుగా నిర్వహించారు.

## XIII మానిటరింగు - పర్యవేక్షణ

ప్రైవేటు యాజమాన్యంలోని పాఠశాలలను కూడా పర్యవేక్షించడానికి ప్రతి మండలానికి ఒక మండల విద్యాధికారి, డివిజన్ స్థాయిలో ఉప విద్యాధికారి. జిల్లాకు జిల్లా విద్యాధికారి, జోన్‌కు ప్రాంతీయ విద్యాధికారి ఉంటారు. వీరు ప్రతి సంవత్సరం ఆయా ప్రైవేటు యాజమాన్య పాఠశాలలకు కూడా తనిఖీలకు వెళుతుంటారు. కాని ఎక్కడ కూడా విద్యాపరమైన సలహాలు, సూచనలు ఇచ్చినట్లుగా గాని, నమోదు చేసినట్లు గాని కనిపించలేదు. ఈ పాఠశాలల్లో ఇప్పుడున్న పరిస్థితి అనగా ప్రభుత్వ సిలబస్‌ను అమలు పరచకపోవడం, ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు అమలు పరచకపోవడం, మూల్యాంకన విధానాలు నిర్వహించకపోవడం, ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేయడం, వారికి ఇష్టమైన పనివేళల్లో బళ్ళు నిర్వహించ‌డం, ఇష్టమైనన్ని పాఠ్యపుస్తకాలు, నోటుబుక్‌లు, గైడ్లు, స్టడీమెటీరియళ్ళు పిల్లలతో కొనిపించడం వంటి అపసవ్య, అశాస్త్రీయ విధానాలు ఇప్పటికిప్పుడే చోటు చేసుకున్నవి కాదు. ఇవన్నీ కూడా తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమలు జరగాల్సి ఉన్నప్పటికీ పర్యవేక్షణాధికారులు చూసి చూడకుండా వదిలివేయడం, పట్టించుకోకపోవడం వల్లనే చోటుచేసుకున్నవి.

ఈ పాఠశాలలకు మానిటరింగ్ వెళ్ళే అధికారులు విద్యాపరమైన దృష్టితో కాకుండా ఇతర దృష్టితో వెళ్ళినట్లుగానే భావించాల్సి ఉంటుంది.

## XIV పిల్లల అభిప్రాయాలు

- దాదాపు అందరు విద్యార్థులు కొత్త పుస్తకాలు బాగున్నాయని, రంగులలో, బొమ్మలన్ని బాగున్నాయని, సొంతంగా చదవడానికి, మూల్యాంకన విధానం, ప్రశాపత్రాల విధానం బాగున్నాయని అన్నారు.
- గణిత పాఠ్య పుస్తకాల్లో విద్యార్థులు ఇంకా ఎక్కువ ఉదాహరణలు ఇవ్వాలని కోరారు. అయితే పుస్తకంలోని వివరణలు బాగున్నాయని, చదివి అర్థం చేసుకునే రీతిలో గణిత పుస్తకాలు ఉన్నాయని అన్నారు.

- గణితంలో ఎక్కువగా ఐ.ఐ.టి., జె.ఇ.ఇ. లకు ఉపయోగపడేవిధంగా కూడా సిలబస్ ఉంటే బాగుంటుందని అన్నారు.
- పిల్లలు ఎక్కువ మంది స్టడీ మెటీరియళ్ళు, గైడ్లు చూసి జవాబులు రాస్తున్నట్లు తెలిపారు.
- ప్రాజెక్టు పనుల కోసం ఎక్కువగా ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.
- పాఠశాలలోనే ఉదయం నుండి సాయంత్రం వరకు ఉంచడం బాగా లేదని అన్నారు. అట్లే తమ తల్లిదండ్రులు కూడా బడిలోనే ఉండి చదువుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. తమకు ఆడుకోవడానికి ఉల్లాసంగా ఉండడానికి సమయం దొరకడం లేదని అన్నారు.
- ప్రాజెక్టు పనులతోపాటు ఎక్కువగా ఇంటిపని ఇవ్వడం వల్ల ఇంటి వద్ద కూడా చదువుకోవడానికి సమయం సరిపోవడం లేదని వాపోతున్నారు.
- బడిలేని రోజంటే పండగలాంటిదన్నారు. దసరా వంటి సెలవు రోజుల్లో కూడా ఉత్సాహంగా గడపడానికి వీలు లేకుండా బండెడు బండెడు ప్రశ్నలు ఇచ్చి రాసుకొని రమ్మని చెప్తారని చెప్పారు.
- టాయిలెట్లు దరిద్రంగా ఉంటాయని, ఎవరైనా పాఠశాలలను చూడడానికి వచ్చినపుడు శుభ్రపరుస్తారని, రోజూ దుర్గంధంతో ఉంటాయని తెలిపారు.

## XV **ఉపాధ్యాయుల అభిప్రాయాలు**

- దాదాపు 80% మంది ఉపాధ్యాయులు నూతన పాఠ్యపుస్తకాలు బాగున్నాయని అన్నారు.
- దాదాపు 90% మంది ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలపై అవగాహన, సి.సి.ఇ. నిర్వహణ, పరీక్షల సంస్కరణలపై అవగాహన కోసం శిక్షణ కోరుకుంటున్నారు.
- సోపానాల ప్రకారం బోధనా పద్ధతిననుసరించి బోధించాలని ఉన్నా యాజమాన్యాలు అంగీకరించడం లేదని తెలిపినారు.
- వార్షిక ప్రణాళికలు, పాఠ్య ప్రణాళికలు రాయడానికి సమయం చాలడం లేదని తెలిపినారు.
- అవసరమైన బోధనా సామగ్రి, వనరులను సమకూర్చమని కోరినా యాజమాన్యాలు అంగీకరించడం లేదని తెలిపినారు.
- 50% ఉపాధ్యాయులు ఈ వృత్తిపైననే ఆధారపడి ఉన్నారు. వారికి ఇచ్చే వేతనాలు చాలడం లేదని తెలిపారు.
- వీరికిచ్చే వేతనాలు కనిష్ఠం రూ.4,000/-, గరిష్ఠం రూ.12,000/- మాత్రమే. అయితే కొన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్, గణితం, విజ్ఞాన శాస్త్రం బోధించే వాళ్ళకు ఇంకొంచెం అధికంగా లభిస్తున్నది.
- పిల్లలు సొంతంగా రాయలేరనే అభిప్రాయాన్ని ఎక్కువ మంది ఉపాధ్యాయులు కలిగి ఉన్నారు.
- అవకాశం ఇద్దాం, ప్రయత్నించి చూద్దాం అనే సానుకూల ధోరణి కలిగిన వారి సంఖ్య చాలా తక్కువ.
- '10వ తరగతి వరకు విద్యార్థులు మీ శిక్షణలోనే తయారవుతున్నారు కదా! ఇన్నేళ్ళ తరవాత కూడా ఆ పిల్లలు సొంతంగా ఎందుకు రాయలేకపోతున్నారు?' అన్న ప్రశ్నకు ఉపాధ్యాయుల నుండి స్పష్టమైన జవాబు లేదు. ఇప్పటికీ పిల్లలదే తప్పు అని, తమ బాధ్యత లేదన్న ధోరణి కనబరుస్తున్నారు.

## XVI **పిల్లల నుండి వసూలు చేసే ఫీజులు**

- ఫీజుల వసూళ్ళు ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క రకంగా ఉన్నది. వీటిలో మండల స్థాయిలో కంటే జిల్లా కేంద్రాల్లో, అక్కడి కంటే రాష్ట్ర రాజధానిలో ఫీజులు ఎక్కువగా వసూలు చేస్తున్నారు.

- తెలుగు మాధ్యమాల కంటే ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో ఫీజులు ఎక్కువగా ఉన్నాయి. ఎక్కువ పాఠశాలల్లో సంవత్సరానికి రెండు లేదా మూడు విడతల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు.
- గరిష్ఠంగా హైదరాబాద్‌లో 10వ తరగతికి రూ.45,000/- వరకు తీసుకుంటున్నారు (డే స్కాలర్స్). రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇందుకు అదనంగా చెల్లించాల్సి వస్తుంది. ఇందుకోసం సగటున రూ.2000/- నుండి రూ.3000/-ల వరకు నెలకు వసూలు చేస్తున్నారు.
- సాధారణ ఉన్నత పాఠశాలల కంటే కాన్సెప్ట్ స్కూళ్ళలో ఎక్కువ, కాన్సెప్ట్ స్కూళ్ళ కంటే టెక్నో స్కూళ్ళలో, టెక్నో స్కూళ్ళ కంటే ఇ-టెక్నో స్కూళ్ళ యాజమాన్యాలు ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నారు. అయితే ఒకే యాజమాన్యానికి చెందిన పాఠశాలల్లో వేర్వేరు సెక్షన్లు, పాఠశాలలు కూడా ఉన్నాయి. ఇవి ఎక్కువగా కార్పొరేట్ పాఠశాలలకు సంబంధించినవి. మండల స్థాయి, జిల్లా కేంద్రాలలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సకాలంలో ఫీజులు వసూలు కాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు చెల్లించలేక పోతున్నారు.

## XVII గమనించిన మంచి విషయాలు

- ప్రతి తరగతికి/ సెక్షన్‌కు ఒక తరగతి గది ఉన్నది.
- ప్రతి సబ్జక్టు బోధించడానికి తగినంత మంది ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు.
- ఏ సమయంలో పాఠశాలకు వెళ్ళినా తరగతి గదుల్లో ఉపాధ్యాయులు ఉండడం, బోధన నిర్వహిస్తుండడం.
- అప్పగించిన పనిని ఉపాధ్యాయులు సకాలంలో బాధ్యతగా పూర్తి చేస్తారు.
- ఏదైనా కారణాలతో ఉపాధ్యాయులు బడికి రాకుంటే సత్వరమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తారు. పిల్లల బోధనకు ఆటంకం కలగకుండా చూసుకుంటారు.
- పిల్లల హాజరు 90% కంటే ఎక్కువగా ఉంటుంది.
- సుమారు పిల్లలందరి చేతి రాత స్పష్టంగా, అందంగా, చదవడానికి వీలుగా ఉండడం.
- దాదాపు 90% పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఉన్నాయి. పిల్లలకు కూడా కంప్యూటర్ పరిజ్ఞానం ఉంది.
- పిల్లల నోట్సు పరిశీలన, పరీక్షల జవాబుపత్రాలు, మదింపు ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నారు.

## XVIIIఅభిలషణీయంగాని చర్యలు

- పిల్లలపై ఎక్కువ ఒత్తిడి, భారాన్ని కలిగించడం.
- స్థాయిని పరిగణలోకి తీసుకోకుండా పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, వర్క్‌బుక్‌ల వంటివి బలవంతంగా కొనిపించి వినియోగింపజేయడం.
- ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలను, కార్యక్రమాలను, ప్రణాళికలను అనుసరించకపోవడం, చులకన భావం ప్రదర్శించడం.
- తమకు బాగా తెలుసని, తాము చేసేదే సరైందన్న దురభిప్రాయం కలిగి ఉండడం.
- ప్రతీది అనగా.. పుస్తకాలు, టై, బ్యాడ్జి, బెల్టు, బట్టలతో సహా అన్నింటిని వ్యాపారమయం చేయడం.
- పాఠశాలల్లో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి పిల్లల నుండి డబ్బులు వసూలు చేయడం.
- పిల్లల బాల్యం, శారీరక మానసిక వికాసం వంటి ముఖ్యమైన అంశాలను పరిగణించకుండా పరీక్షలు, మార్కులు, ర్యాంకుల వంటి వాటికి అధిక ప్రాధాన్యతనిచ్చి చదువులను యాంత్రికంగా మార్చడం.

- తమ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల పట్ల గౌరవ భావాన్ని ప్రదర్శించడానికి బదులు కేవలం ఉద్యోగిగానే పరిగణిస్తారు (వృత్తిపరమైన గౌరవం ఉపాధ్యాయులకు లభించడం లేదు).
- పిల్లలకు/ ఉపాధ్యాయులకు అంతర్గత స్వేచ్ఛ లేదు. యాజమాన్యం నియమ నిబంధనలకు లోబడే వీరి ప్రవర్తన, పనితీరు ఉంటుంది.
- పిల్లల బాల్యాన్ని హరించేటట్లుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కొన్ని సందర్భాల్లో రాత్రి వరకు బలవంతంగా చదువుకే పరిమితం చేస్తున్నారు. వాళ్ళను ఆటపాటల నుండి దూరం చేయడం, మాట్లాడుకోనివ్వకుండా కట్టడి చేయడం వంటి అశాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తున్నారు.
- మూత్రశాలలు వంటి కనీస అవసరాలు సరిపడే సంఖ్యలో లేకుండటం. నిర్వహణ సక్రమంగా లేకపోవడం అనారోగ్యకరం.
- పిల్లల స్థాయి ఆశాజనకంగా లేకపోవడం. ఉపాధ్యాయుల స్థాయి అంతంతమాత్రంగానే ఉండటం.
- ఉపాధ్యాయులు ప్రణాళికారహితంగా, తగిన సంసిద్ధత లేకుండానే బోధన నిర్వహించడం.
- క్రమశిక్షణ పేరుతో పిల్లల స్వేచ్ఛను హరిస్తున్నారు. మాట్లాడనివ్వరు. ప్రశ్నించే అవకాశం ఇవ్వరు. దీని వల్ల కొంత మంది పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి లోనై అసాంఘిక కార్యకలాపాల వైపు మొగ్గు చూపిస్తున్నారు.
- బోధనకు అవసరమైన వనరులు అనగా.. గ్రంథాలయాలు, ప్రయోగశాలలు వంటి వాటిని తృణీకరించడం. అట్లే నిర్ధారించిన విధంగా పాఠాలను పూర్తి చేయడం కంటే ముందుగానే పూర్తి చేసి పరీక్షల కోసం బట్టీ పట్టించడం.
- ఉపాధ్యాయుల సామర్థ్యాల అభివృద్ధి పట్ల దృష్టి పెట్టకపోవడం, వృత్యంతర శిక్షణల ఆవశ్యకతను యాజమాన్యాలు పట్టించుకోకపోవడం.
- తమ పాఠశాలను ఎవ్వరూ మానిటరింగ్ చేయరని, దేని గురించైనా ఎవ్వరూ ప్రశ్నించరని, ఎలాంటి పరిస్థితులైనా తాము అధిగమించగలమని ధీమా కలిగి ఉండడం.

## XIX **చేపట్టాల్సిన చర్యలు**

- అన్ని పాఠశాలల్లో శిక్షణ పొందినవారే ఉపాధ్యాయులుగా పనిచేసేటట్లు చూడడం. వీళ్ళకు ప్రతి సంవత్సరం కనీసం ఐదు రోజుల వృత్యంతర శిక్షణ ఏర్పాటు చేయడం.
- ఎటువంటి శిక్షణ లేకుండా పనిచేసే వాళ్ళ కోసం ప్రభుత్వమే ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సు దూరవిద్య ద్వారా నిర్వహించడం.
- ప్రభుత్వ విధి విధానాలను (పాఠశాలల పనివేళలు, పాఠ్యపుస్తకాలు, పరీక్షలు, సి.సి.ఇ., బోధనా నిర్వహణ మొ॥వి.) తప్పకుండా అమలయ్యేటట్లు చూడడం.
- ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేయడాన్ని నియంత్రించడానికి ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ కమీషన్ వంటి సంస్థను ఏర్పాటు చేయడం.
- పాఠశాల ఆదాయాన్ని అనుసరించి ఉపాధ్యాయుల వేతనాలను క్రమబద్ధీకరించడం.
- ప్రతి పాఠశాలలో ఆర్.టి.ఇ. చట్టాన్ని అనుసరించి ఉపాధ్యాయులు, భౌతిక వనరులు, బోధనా పద్ధతులు ఉండేటట్లు చర్యలు చేపట్టడం.
- పాఠశాల మానిటరింగ్‌ను పటిష్టపరచడం. ప్రభుత్వ పాఠశాల వలెనే నిర్ణీత కాలవ్యవధిలో మానిటరింగ్ సక్రమంగా జరిగేటట్లు చూడడం.
- పిల్లల సమగ్ర మూర్తిమత్వ అభివృద్ధి (Children allround development) కోసం పాఠశాలలో తప్పకుండా సహపాఠ్య సబ్జక్టులు బోధించేలా చేయడం.
- పాఠశాలలోని లోపాలకు, లోటుపాట్లకు యాజమాన్యంతోపాటు మానిటరింగ్ అధికారులను బాధ్యులను చేసి శాఖాపరమైన చర్యలు చేపట్టడం.

- ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ విద్యా కళాశాలలు/ జిల్లా విద్యా శిక్షణా సంస్థలు/ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ వంటి సంస్థల ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల పనితీరు, బోధనా విధానాలు, పిల్లల ప్రగతి మొదలగు అంశాల గురించి పరిశోధనా కార్యక్రమాలు నిర్వహించి చర్యలు చేపట్టడం.
- విద్యాశాఖలో చోటు చేసుకునే కొత్త పోకడలు, పరిణామాలు, మార్పులుచేర్పుల గురించి విద్యాశాఖ అధికారులతో పాటు ప్రైవేట్ యాజమాన్యాలకు కూడా శిక్షణ నిర్వహించి అవగాహన కల్పించడం.
- దోషాలు జరగడానికి అవకాశాలు లేకుండా పారదర్శక విధానాలు అమలయ్యేటట్లు పరిపాలనలో, సమాచార సేకరణలో ఆన్‌లైన్ విధానాలను అమలుపరచడం, విధి విధానాలను రూపొందించడం.